# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

గురువారం 13 నవంబర్ 2025





## 14న 2కె రన్ విజయవంతం చేయండి

**ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కే తిరుపతి..**

**పోస్టర్ ఆవిష్కరించిన పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్**

**జమ్మికుంట, నవంబర్ 12 (నినాదం):** ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఈనెల 14న 2 కె రన్ నిర్వహించడం జరుగుతుందని హుజురాబాద్ జమ్మికుంట బ్రాంచ్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కనవేన తిరుపతి తెలిపారు. బుధవారం జమ్మికుంట ఐఎంఏ వైద్యులు డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ టు కే రన్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరల్డ్ డయాబెటిక్స్ డే సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుండి గాంధీ చౌరస్తా మీదుగా డిగ్రీ కళాశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉచిత డయాబెటిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మండలంలోని యువతి యువకులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## నవంబర్ 16న ఖమ్మ మహాజన సంఘం వనసమారాధన

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12: (నినాదం):** కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యం లో నవంబర్ 16న కార్తీక మాస వనసమారాధన ఘనంగా జరగనుంది. కార్యక్రమం ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని సంఘ అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారా యణ, కార్యదర్శి చావా రాము తెలిపారు. బుధవారం చెరుకూరి మామిడి తోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ సమాజంలో బంధు త్వం, ఏకతా భావం పెంపొందించ డమే వనసమారాధన ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా పాల్గొనాలం టూ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఆహ్వానం పలికారు. భక్తి కార్యక్రమా లు, పిల్లల గేమ్స్, మహిళల పోటీ లు, వంటల పోటీలు, సాంస్కృ తిక ప్రదర్శనలు, కబడ్డీ, సినీ కళాకారుల సంగీత విభావరి వంటి పలు ఆకర్ష ణలు ఉండనున్నాయని, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబి చేలా వేదిక అలంకర ణలు, కార్యక్రమాలు రూపొందించామనితెలిపారు. కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు హాజరు కా నున్నారని వారు తెలిపారు సంఘ కార్యకలాపాలు ప్రజలకు చేరేలా మీడియా సహకారం అమూల్యమని, వనసమారాధన విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు



## ఘనంగా నవదుర్గ మాత ఆలయ 5వ వార్షికోత్సవం

**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 12 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ నవదుర్గ మాత ఆలయం 5వ వార్షికోత్సవ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన మహా పూజలు, హోమాలు, అలంకరణలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించిన వారు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, స్థానిక ప్రజలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున హాజరై దేవీదర్శనం చేసుకున్నారు. భక్తి నమ్మకాలు, ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యత ప్రతిఫలించిన ఈ వేడుక అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయం ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని భక్తులు, అధికారులు,కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ అలుక కిషన్, కార్యదర్శి సంఘం అమృత్ కుమార్, సహాధ్యక్షులు చిట్టి నారాయణ, ఖజానాదారు సత్యనారాయణ, సభ్యులు ఉమా కిరణ్, సత్యం, గంధం వెంకటేశ్వర్లు, పెద్దోళ్ల నాగరాజు తదితర కమిటీ సభ్యుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

## తెలంగాణ జాగృతి నిజామాబాద్ జిల్లా అడహక్ కమిటీ నియామకం

**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 12 (నినాదం):** తెలంగాణ సమాజ వికాసం కోసం, నవ తెలంగాణ నిర్మాణం కోసం శ్రమిస్తున్న తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడంతో పాటు కార్యకలాపాలను విస్తృతం కోసం నిజామాబాద్ జిల్లా అడహక్ కమిటీని ఎర్పాటు చేసినట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లా అడహక్ కమిటీలో సభ్యులుగా సూదం రవిచంధర్, అవంతి కుమార్, ఏంఎ రజాక్, శ్రీనివాస్ గౌడ్ ఏలూరి, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మహమ్మద్ రెహన్ అహ్మద్, నవీన్ పటేల్ లను, అధికార ప్రతినిధులుగా తెలంగాణ శంకర్, ద్యావడే సంజీవ్, శేఖర్ రాజ్, కోర్ర సంతోష్ నాయక్, తిరుపతిరాములను నియమించారు. బోదన్ నియోజకవర్గం అడహక్ కమిటీలో దొంత ప్రవీణ్ కుమార్, నూర్ పతేపూర్, రాఘవేందర్ యాదవ్, భవానిపేట్ శ్రీనివాస్, వై.సాయిలు లను నియమించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అడహక్ కమిటీ కరిపే రాజు, మహ్మద్ రెహన్ అహ్మద్, ఇరుముల శంకర్, పంచరెడ్డి మురళి, యెండల ప్రసాద్, అంబటి శ్రీనివాస్ గౌడ్, సాయి క్రిష్ణ నేత, షానవాజ్ ఖాన్ లను నియమించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అడహక్ కమిటిలో భానోత్ నరేష్ నాయక్, బానోత్ ప్రేమ్ దాస్ లను , ఆర్మూర్ నియోజకవర్గం అడహక్ కమిటిలో ఏలేటి నవీన్ రెడ్డి, ఆకునూరి మనోజ్ రావు, అహ్మద్ అజం లను, బాల్కొండ నియోజకవర్గ కమిటిలో సుంకేట్ మహేంధర్ రెడ్డి, కర్నాట ధీరజ్ లను నియమించారు.

## మొక్కజొన్న సాగు చేయు రైతులు తప్పనిసరిగా

# విత్తన కంపెనీతో అగ్రిమెంట్ తీసుకోవాలి

**వ్యవసాయ శాఖ సహాయ సంచాకులు కొంగర**

**ఖమ్మం, నవంబర్ 12(నినాదం):** రైతులు మొక్కజొన్న సాగు చేసేటప్పుడు తప్పనిసరిగా ఆ ఆ కంపెనీ యాజమాన్యంతో కానీ ప్రతి నిధితో కానీ తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకోవాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలంలోని రాములు తండా, రామ్ క్యా తండా, చెరువు కొమ్ము తండా మరియు మంచుకొండ గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, కొంగర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విత్తన మొక్కజొన్న సాగు చేసేటటువంటి రైతులకు





అవగాహన కార్యక్రమాలు కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఏడిఏ మాట్లాడుతూ ఇతన మొక్కజొన్న సాగు విత్తన చట్ట పరిధిలో లేనందున రైతులు ఇవ్వబడినటువంటి సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. దీనిలో భాగంగా ఎవరైతే రైతులు ద్వారా విత్తన సాగు చేసేటటువంటి ఆర్గనైజర్లు ఉన్నారో వారికి విత్తన కంపెనీ ద్వారా అగ్రిమెంట్ ఉందా లేదా అని మొదటగా నిర్ధారించుకొని, ఏ విత్తన కంపెనీ యొక్క అగ్రిమెంట్ ద్వారా విత్తనాలు ఇస్తున్నారో విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తెలుసుకొని తప్పనిసరిగా విత్తన కంపెనీ మరియు ఆర్గనైజర్లు (కంపెనీ ప్రతినిధుల) నుంచి అగ్రిమెంట్ ద్వారా మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగింది.

ఎటువంటిఅగ్రిమెంట్ లేకుండా ఏజెంట్లు మాటలు నమ్మి విత్తన మొక్కజొన్న సాగుచేస్తే నష్టపోయే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. రైతులను ఆకట్టుకునేందుకు ముందుగా ఎకరానికి కొంత నగదును ముట్ట చెప్పి పంట పండిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసాలు చేయడం జరుగుతున్నాయని కావున రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ కుదుర్చుకొని సాగు చేయవలసిందిగా సూచించడం జరిగింది. అదేవిధంగా రైతులు విత్తన సాగు చేసేటటువంటి సమయంలో కంపెనీ శాస్త్రవేత్తలు క్షేత్రాలను సందర్శించి సాంకేతిక సలహాలు, డిటేసలింగ్ వంటి వాటి గురించి రైతులకు సలహాలు ఇచ్చేలా ఏజెంట్లు వ్యవహరించాలని సూచించడం జరిగింది.

## ప్రజల మద్దతు చూసి ఓర్వలేక పోతున్నారు

**నల్గొండలో కవితక్క ఫ్లెక్సీలు హోర్డింగ్స్‌ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**గుంజపడుగు హరిప్రసాద్ జాగృతి జిల్లా అధ్యక్షుడు**



**కరీంనగర్,నవంబర్ 12(నినాదం):** జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజులుగా నల్గొండ జిల్లాలో పర్యటిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. నల్గొండ పట్టణంలో జాగృతి జనంబాటలో వస్తున్న కవితక్క స్వాగతం తెలపడానికి ఎర్పాటు చేసుకున్న హోర్డింగులు, ఫ్లెక్సీలను రాత్రికి రాత్రే తొలగించడం ప్రభుత్వం యొక్క దివాలా కోరుతనానికి నిదర్శనం అని వారు అన్నారు. జాగృతి అధ్యక్షురాలు కవితక్క చేపట్టిన జనం బాటలో ప్రతి జిల్లాలో ఉన్న ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను ఎక్కడికక్కడ ఎండాగాడుతూ ప్రజలను కలుపుకుని వారి సూచనలు, సలహాలను తీసుకుంటూ జాగృతి బలోపేతానికి ముందుకు సాగుతుందని ప్రజలు నుండి కవితక్కకు వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేకే నల్గొండ జిల్లా మంత్రుల కనుసన్నాలలో నల్గొండ మున్సిపల్ అధికారాలు వాటిని తొలగించారని, ఫ్లెక్సీలను తొలగించినంతా మాత్రాన గత ఇరవై సంవత్సరాల నుండి కవితక్క ప్రజలు మనస్సులో ఎర్పాటు చేసుకున్న స్థానాన్ని ఎవరు చెరిపివెయ్యలేరని హరిప్రసాద్ అన్నారు.

## హుజురాబాద్‌లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**జమ్మికుంట, నవంబర్ 12 ( నినాదం):** ప్రభుత్వ సేవల్లో చురుకుదనం, పారదర్శకతతో ఉత్తమ కమిషనర్ ప్రశంసలు అందుకున్న హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య పిల్లల ఆరోగ్యం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి ప్రాథమిక, సెకండరీ పాఠశాలల వంటశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా బోర్నపల్లి పాఠశాలల వంటశాలల్లో నెలకొన్న తీవ్ర అపరిశుభ్రతపై కమిషనర్ సమ్మయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కలుషిత ఆహారం వలన విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నందున ఆయన అప్పటికప్పుడే కీలక నిర్ణయం తీసుకున్నారు..వంటశాలలను ప్రతిరోజూ నీట్గా ఉంచు కోవాలి. విద్యార్థులకు పెట్టే భోజనం అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. విద్యార్థుల ఆరోగ్యంతో రాజీ పడటానికి వీల్లేదు!" అని వంట సిబ్బందికి ఆయన కఠినంగా సూచించారు. స్పాట్లోనే మున్సిపల్ సిబ్బందితో క్లీనింగ్... కమిషనర్ సమ్మయ్య కేవలం ఆదేశాలు ఇచ్చి ఊరుకోకుండా సమస్య పరిష్కారం కోసం తక్షణమే రంగంలోకి దిగారు. వెంటనే



మున్సిపల్ సిబ్బందిని రప్పించి వారి పర్యవేక్షణలో ఆయా వంటశాలలను పూర్తిగా శుభ్రం చేయించారు. మున్సిపల్ కమిషనర్ స్వయంగా దగ్గరుండి క్లీనింగ్ చేయించడం పట్ల ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

**కఠిన హెచ్చరికలు..**

భవిష్యత్తులో ఇటువంటి అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయకూడదని కమిషనర్ గట్టిగా హెచ్చరించారు. వంటలు చేసే మహిళలు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని మాత్రమే అందించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు..

## పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ళ పంపిణి

**కరీంనగర్, నవంబర్ 12(నినాదం)** పోలంపల్లిలో బండి సంజయ్ సైకిల్‌ల పంపిణి...పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ ఉచితంగా ఇస్తున్నటువంటి సైకిల్ లను బుధవారం పోలంపల్లి పాఠశాలలో పంపిణి చేసారు. స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన బిజెపి మండల అధ్యక్షులు జగదీశ్వర చారి మాట్లాడుతూ, సైకిల్ లే కాకుండా 10 వ తరగతి వారి పరీక్ష ల ఫీజు లను కూడా కేంద్ర మంత్రే చెల్లించడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. సైకిల్ లతో పాటుగా విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లిస్తున్నటువంటి కేంద్ర మంత్రి బండి సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంచార్జ్ మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానో



పాధ్యాయులు కరుణాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు వొద్నాల రవీందర్,పడాల శ్రీనివాస్ గౌడ్,పడాల సారయ్య, రాపర్తి రవీందర్, బుడిగే మహేష్,బుడిగే నరేష్, కాశవేణి రాజు,పచ్చిమట్ల మల్లయ్య, పడాల తిరుపతి,రేగూరి సుగుణాకర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రెడ్డి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బై పోల్ ఫలితాలతో బిఆర్ఎస్ దుకాణం బంద్

**విద్వేష ప్రసంగాలతో డిపాజిట్ కోల్పోనున్న బిజెపి**

**దొంతి గోపి, 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకులు**



**కరీంనగర్,నవంబర్ 12,(నినాదం):** గత 9 ఏళ్ల పాలనలో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థి గెలుపు కోసం నగదు, మద్యం ఏరులై పారించినప్పటికీ, అభ్యర్థి ఎంపికలో తన రాజకీయ అనుభవాన్ని ప్రదర్శించిన హైదరాబాద్ ఇన్చార్జి మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారి వ్యూహానికి తోడు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యం లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల కార్యకర్తల విస్తృత స్థాయి ప్రచారంతో పాటు అభివృద్ధిని కాంక్షించే వారు విజ్ఞతతో ఓటు వేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని స్వీక రించిన జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించ నున్నారని పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు నిరూ పించాయని, 30వ డివిజన్ కాంగ్రెస్ అధ్య క్షులు దొంతి గోపి పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు ఇతర నేతలు రంగంలో దిగి, ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్ని పన్నాగాలు పన్నినప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ పార్టీనీ నమ్మలేదని, ఈ ఎన్నిక ఫలితాలతో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిం దని స్పష్టం అవుతుందని ఇక కేటీఆర్ ముల్లె మూటా సర్దుకుని ఎక్కడి నుండి వచ్చారో అక్కడికే చేరుకునే సమయం ఆసన్నమైనదని ఎద్దేవా చేశారు. ఎన్నిక ప్రచారంలో భాగంగా బిజెపి కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి రాజకీయ పరిపక్వత లేని నాయకులలా తమ స్థాయిని దిగజారి చేసిన ప్రసంగాలతో ఇటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు అటు రాష్ట్ర ప్రజలు అసహ్యించు కుంటున్నారు, ఒక సందర్భంలో ప్రశాంతమైన వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా వారు చేసిన ఉ పన్యాసాలతో హైదరాబాద్ ప్రజలు ఆందోళన చెందడంతో పాటు ఈ విష సంస్కృతికి ఆద్యం పోస్తున్న బిజెపిని బొంద పెట్టాలని భావించినట్లుగా ఫలితాల సరళి కనబడుతుంది అన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలు మరో వంద సంవత్సరాలు

# గుర్తుండేలా నిర్వహించాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు**




నాగర్ కర్నూలు ప్రతినిధి నవంబర్ 12 (నినాదం)భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ చరిత్రలో మరో వంద సంవత్సరాలు నిల్చుండీ పోయేలా నిర్వహించాలని అందుకు ఈ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పార్టీ శ్రమించి పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు పిలుపు ఇచ్చారు నాగర్ కర్నూల్ జిల్లా సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ మహబూబ్నగర్ జిల్లా సమితి సభ్యుల సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ రాజకీయ చరిత్రలో 100 సంవత్సరాలు ప్రజల కోసం పనిచేసిన చరిత్ర మరేఏ పార్టీకి లేదని అది కేవలం సిపిఐకే దక్కిన ఘనతని ఆయన గుర్తు చేశారు ఉద్యమం నుంచి మొదలుకొని తెలంగాణ ప్రాంతాన్ని స్వతంత్ర భారత దేశంలో విలీనం చేసిన తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని ఇప్పుడున్న భారతదేశాన్ని నిర్మించుకోవడానికి 100 సంవత్సరాలుగా రాజీలేని పోరాటాలు నిర్వహించింది సిపిఐ పార్టీనని ఆయన తెలియజేశారు దేశంలోని ప్రజలందరూ ఒక్కటేనని సుఖశాంతులతో జీవించే సోషలిజం సమ సమాజమే కమ్యూనిస్టు పార్టీ సిపిఐ లక్ష్యం అన్నారు. నేడు దేశంలో రాష్ట్రంలో ఆర్థిక కుల మతలు ప్రజల మధ్య విభజన రేఖలు గీస్తున్నాయని అవి రూపుమారేంతవరకు సిపిఐ ఉద్యమాలు నిర్మిస్తూనే ఉంటుందని గుర్తు చేశారు. సిపిఐ ఏనాడు ఓట్లు సీట్లు ముఖ్యం అని భావించలేదని వంద సంవత్సరాలలో ఒక్కరోజు అధికారంలో లేకున్నా నిత్యం ప్రజల కోసమే పని చేస్తుందని 119 మంది శాసనసభ్యుల లో ఒకే ఒక్క ఎర్రజెండా ఎమ్మెల్యేగా కోట్ల మంది ప్రజల బాధలను వినిపించ గలుగుతున్నామన్నారు. బుధవారం నుండి డిసెంబర్ 26 వరకు పార్టీ సభ్యుల ప్రతి అడుగు ఖమ్మం సభను విజయవంతం చేయడానికి వెయ్యాలని ఆయన కోరారు. లక్షలాది మందితో అఖిల భారత స్థాయిలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు ఈ భూమి పై మనుషులు ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటుందని సిపిఐ ఉంటుందని ఆయన అన్నారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల నరసింహ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని వేలాదిమంది ఖమ్మం నగరానికి తరలించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ చరిత్రను వివరించారు ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి అధ్యక్షత వహించగా సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్ గద్వాల జిల్లా కార్యదర్శి బి అంజనేయులు వనపర్తి జిల్లా కార్యదర్శి కే విజయ రాములు నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే కేశవులు గౌడ్ వార్ల వెంకటయ్య ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారేపాక అనిల్ కుమార్ సిపిఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు సమితి సభ్యులు వివిధ ప్రజాసంఘాల మండల కార్యదర్శిలు స్థానిక నాయకులు పి నరసింహ టి విజయుడు ఈర్ల చంద్రమౌళి మారుడి శివశంకర్ బండి లక్ష్మీపతి తుమ్మల శివుడు తప్పేట కిరణ్ కుమార్ పట్టణ కార్యదర్శి గోపి చారి కొత్త రామ స్వామి బి వెంకటస్వామి పి కళావతమ్మ కృష్ణాజి రవీందర్ శంకర్ గౌడ్ బి శ్రీనివాసులు శ్రీనివాసులు పాల్గొన్నారు

గురువారం, తెలంగాణ
13 నవంబర్ 2025
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## నేటి నుండి వృద్ధులకు చైతన్య కార్యక్రమాలు

### ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, నవంబర్12,(నినాదం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వృద్ధులకు అవగాహన వారిని చైతన్య పరిచేందుకు వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని దివ్యాంగుల, వికలాంగుల ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జరుగుతుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా సంక్షేమ అధికారి శారద, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, నవంబర్ 13 నుండి 19 వరకు జిల్లాలో వారం రోజులపాటు వృద్ధుల కోసం అవగాహన కార్యక్రమాల తో పాటు వారికి ప్రోత్సాహకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వృద్ధులు చురుకుగా పాల్గొని తమ అనుభవాలను పంచుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా వ్యాప్తంగా వృద్ధుల ఆరోగ్యం, భద్రత, సామాజిక భాగస్వామ్యం, శ్రేయస్సు పెంపుదలకై అవగాహన కార్యక్రమాలు, చర్చా వేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సంక్షేమ అధికారులు తెలిపారు.

## కార్పొరేషన్ పరిధిలో మహిళ అదృశ్యం

### పిఎస్‌లో ఫిర్యాదు చేసిన భర్త



**జవహర్‌నగర్, నవంబర్ 12 (నినాదం):** భార్యాభర్తల మధ్య గొడవలతో భార్య అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం. కార్పొరేషన్ పరిధిలోని మల్కారం సిఆర్పిఎఫ్ క్వార్టర్స్ లో బండి సౌజన్య,( 36) బండి ప్రశాంత్ దంపతులు నివసిస్తున్నారు. ఈనెల 10వ తేదీన దంపతుల మధ్య గొడవ జరగగా మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు ఇంట్లో మేల్కొని చూడగా తన భార్య సౌజన్య కనిపించలేదు. ఈ మేరకు ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భర్త బండి ప్రశాంత్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేస్తున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 16 నెలల్లో డబుల్ ఇండ్లు కట్టిస్తామని 10 ఏళ్లు గడిచినా పట్టాలు ఇవ్వలేదు

### సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ ఆగ్రహం



**మహేశ్వరం, నవంబర్ 12 (నినాదం):** జంగంమేట్ డివిజన్ సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఎం.సి.హెచ్. క్వార్టర్స్‌లో నివసిస్తున్న 72 కుటుంబాలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ.కృష్ణ నాయక్ మాట్లాడుతూ 16 నెలల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటికీ పేదలను పట్టించుకోవడం లేదు. పదేళ్లు గడిచినా ఇండ్ల పట్టాలు ఇవ్వలేదు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అతను మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ పేదల సమస్యలు పరిష్కారమవ్వక కాలయాపన కొనసాగుతుందని విమర్శించారు. "డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి ఇచ్చినా ఇప్పటికీ వాటికి పట్టాలు ఇవ్వలేదు. పేదల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తోంది" అని ఆరోపించారు. కృష్ణ నాయక్ ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తూ తక్షణమే 72 కుటుంబాలకు ఇండ్ల పట్టాలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ కలెక్షన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఉద్యమాలు ముమ్మరం చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు కుమార్, శేఖర్, వీరమ్మ, లక్ష్మీబాయి, లావణ్య, స్వప్న, రేణుక, సంగీత, అనిత, అక్కుబాయి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్

### నేరేడ్‌మెట్ పిహెచ్‌సిలో దంత ఈఎన్‌టి పరీక్షలు





**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,నవంబర్12, (నినాదం):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మల్కాజిగిరి పిహెచ్ సి ఆధ్వర్యంలో నేరేడ్ మెట్ ప్రభుత్వ హై స్కూల్ విద్యార్థులకు దంత, ఈఎన్ టి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 35 మంది విద్యార్థులు స్క్రీనింగ్ చేయబడగా అందులో 26 మంది విద్యార్థులకు పాడైన దంతాల (డికేడ్ టూత్) సమస్యలు గుర్తించబడినవి వీరికి ఫిల్లింగ్స్, ఎక్స్ట్రాక్షన్‌లు వంటి చికిత్సలు అడ్వాన్స్‌డ్ డెంటల్ కేర్ యూనిట్, పిహెచ్సీ మల్కాజిగిరిలో డాక్టర్ వినోద్ దంత వైద్య నిపుణుల పర్యవేక్షణలో జరిగింది. అదేవిధంగా, ఎంహెచ్‌టీ-1 నుండి వచ్చిన 4 మంది ఆర్‌బిఎస్‌కే విద్యార్థులు దంత చికిత్స కోసం పిహెచ్ సి మల్కాజిగిరిలో రిఫరల్ ఆధారంగా చికిత్స పొందారు. ఒక పి హెచ్ సి పరిధి లో ఇలాంటి అరుదైన సేవలు అందించబడడం ఎంతైనా ప్రశంసనీయం అని లోకల్ ప్రజా ప్రతినిధులు డాక్టర్ వినోద్ ని ప్రశమశించడం జరిగినది. ఈ కార్యక్రమం లో. డాక్టర్ వినోద్, దంత వైద్య నిపుణులు, ఆర్ బి ఎస్ కె డాక్టర్స్, సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# చెరువులను సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతాం

**పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం మియపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాథమ్ చెరువు సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ వారి సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరికరణ, పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా చెరువును పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగ వాడ్, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడుదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు. చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని తెలియచేశారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింప జేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందని అన్నారు. మియపూర్ లోని చెరువులకు నేటితో దశ దిశ మారినదని, ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని తెలిపారు. శాశ్వత పరిష్కారం దిశగా చెరువులను అభివృద్ధి చేపట్టడం జరిగిందని, మురికి కూపంలాంటి చెరువులకు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువుళ్లుగా తీర్చిదిద్దాడమే ధ్యేయంగా పని చేసి నిరూపించడం జరుగుతుందని అన్నారు. గుర్నాథమ్ చెరువు పునర్జీవనం తరువాత సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతమవుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని, చెరువు కట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని అన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరికరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినదించదగ్గ విషయం అని అన్నారు. సమాజ హితం, సమాజ సేవ చేయడం కోసం ముందుకు రావడం చాలా గర్వించదగ్గ విషయమని, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్ ని, సాఫ్ట్ వెర్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా గాంధీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులు జయన్ నాయక్, నిలేష్ సింగ్, నిశాంక్ జోషి, హర్ష, తన్వీర్ షేక్ బ్లాక్ స్టోన్ గ్లోబల్ ఈ ఎస్ జి ప్రతినిధులు ఏరిక్, పారిస్, సి ఎస్ ఆర్ ఐటీ సంస్థ ప్రతినిదులు చైతన్య, రాము, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాచుపల్లి శ్రీ పార్వతీ ఉమామహేశ్వర ఆలయంలో

# అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ





- 2008 నుండి ప్రతి ఏటా 41 రోజులు అల్పాహారం, అన్న ప్రసాద వితరణ
- ప్రతిరోజు 500 నుండి 1000 మంది స్వాములకు అన్న ప్రసాదాలు అందజేత
- 13 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములకు అండగా నిలుస్తున్న ఆగం పాండు ముదిరాజ్ సేవలు



**కుత్బుల్లాపూర్, నవంబర్ 12 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి లో వెలసిన శ్రీ పార్వతీ ఉమామహేశ్వర స్వామివారి చారిత్రక పురాతన ఆలయంలో అయ్యప్ప స్వామి మాల ధారణ స్వాములకు 2008 సంవత్సరం నుండి నేటికీ ప్రతి సంవత్సరం 41 రోజులు అల్పాహారం, అన్న ప్రసాద వితరణను బాచుపల్లి మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. ప్రజల నాయకుడిగా, పాలకుడుగా, ఆపదలో వచ్చే వారికి చేయూతను అందించే నేతగా ప్రతిరోజు సమస్యల పరిష్కారానికి ఆయన వద్దకు వచ్చే ప్రజలకు ప్రతి రోజు సహకారం అందించడం ఆయన ప్రత్యేకత. భక్తి మార్గంలో నడిచే స్వాములకు అండగా నిలుస్తూ వారికి సహాయ సహకారాలు అందించడం ఆగం పాండు ముదిరాజ్ నిస్వార్థంగా అందించే సేవలను పలువురు కొనియాడుతుంటారు. 2008 సంవత్సరంలో ప్రారంభమైన అయ్యప్ప స్వాములకు కావలసిన అల్పాహారం, అన్న వితరణ సేవలను క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం సేవా దృక్పథంతో ప్రతిరోజు 500 నుండి 1000 మంది స్వాములకు అందించడం ఆగం పాండు ముదిరాజ్ భక్తి తత్పరతకు నిదర్శనమని పలురు స్వాములు కొనియాడుతుంటారు. అయ్యప్ప స్వాములకు భక్తి ప్రపత్తులతో స్నానాధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో అయ్యప్ప స్వాములు సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించుకొనుటకుగాను ఆయన శ్రీ పార్వతీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాల ధారణ వేసిన రోజు నుండి మాల విరమణ చేసే రోజు వరకు ఎంత మంది స్వాములు వచ్చిన కాదు, లేదు అనకుండా కావలసినంత అల్పాహారము, అన్న ప్రసాద వితరణ నిరాటంకంగా కొనసాగిస్తుంటారు. ప్రతిరోజు స్వాములకు స్వయంగా మిగతా స్వాములతో పాటు ఆగం పాండు ముదిరాజ్ స్వామి కూడా ఆహార పదార్థాలను స్వయంగా వడ్డన చేయడం అయ్యప్ప స్వాములకు ఆయన అందించే ప్రత్యేక సేవా కార్యక్రమాలకు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆగం పాండు ముదిరాజ్ మాట్లాడుతూ ఈ వ్యక్తి అయినా తను సంపాదించిన ధనంలో కొంతమేరకైనా సేవా కార్యక్రమాలకు వినియోగించుటకు ముందుకు రావాలని కోరారు. మానవసేవే మాధవసేవగా భావించాలని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రతి మనిషి భక్తి మార్గంలో నడిస్తే ఈర్ష్యా ద్వేషాలు, స్వార్థం తగ్గిపోతాయని, సత్ప్రవర్తనతో సన్మార్గంలో నడుచుటకు భక్తి మార్గం ఎంతో దోహదపడుతుందన్నారు. అవకాశం ఉన్న ప్రతి వ్యక్తి అవకాశాన్ని బట్టి సంవత్సరంలో కొన్ని రోజులైనా దేవుడి పేరున భక్తి మార్గంలో నడిచే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని ఆగం పాండు ముదిరాజ్ ప్రజలకు విన్నవించారు.

## సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

### పిఏసి చైర్మన్ ఆరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పిఏసి చైర్మన్ ఆరికపూడి గాంధీ అన్నారు. బుధవారం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ స్వామి వివేకానంద విగ్రహం నుండి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు రూ.70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సర్విస్ రోడ్డు నిర్మాణం పనులను పిఏసి చైర్మన్ ఆరికపూడి గాంధీ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి సర్విస్ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఈఈ గోవర్ధన్, ఏఈ నిఖిల్, నాయకులు సంజీవ రెడ్డి, నాయినేనీ చంద్రకాంత్ రావు, కావూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మట్టి మనిషి ప్రజాకవి అందెశ్రీకి అశ్రునివాళి

- తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక సంతాపం



**జవహర్‌నగర్, నవంబర్ 12 (నినాదం):** తెలంగాణ మట్టి మనిషి ప్రజా కవి వాగ్గేయకారుడు తెలంగాణ ఆణిముత్యం అందెశ్రీ యేనని తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సంతాపం వెలిబుచ్చింది. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర కమిటీ సభ్యులు మబ్బు బాలు తదితరులు పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ ప్రజా కవి వాగ్గేయకారుడు అందెశ్రీ హఠాన్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తున్నామని తెలంగాణ యాసలో మాట్లాడే ఆయన ప్రతి మాట కూడా ఒక కవిత్వ వరవడిలో ప్రాసలో పదాలు రాగాలు పలుకుతాయన్నారు. తెలంగాణ మట్టి పెల్లల నుండి వచ్చే వాసనను అతని పదాలు గుర్తు చేస్తాయని తెలిపారు. ఆయన ఒక సహజ కవి అని చిన్నతనం నుండి అందెశ్రీ శ్రమజీవి అని ఆయన మాటలు ఆశు కవిత్వం ఈ మట్టిని తలుచుకుంటూ విప్లవ భావాలు రేకెత్తిస్తాయని తెలిపారు. ఎండిపోయిన బీడు భూముల పైన తినడానికి తిండి లేక పసి పిల్లలను తెలంగాణ ప్రజలు ఏ విధంగా సాకుతున్నారో చూసి చలించి పోయాడన్నారు. తెలంగాణ మట్టి మనుషుల కళ్ళల్లోని కన్నీళ్లు తడిమాడు. చెమట జీవులలో శ్రమ సైతం ఒక్కడిగా పని చేశాడు. కష్టాల కడగండ్లలో జీవితాన్ని ఈదుకుంటూ వచ్చాడు. సాధారణ జీవితాన్ని గడుపుతూ ఉన్నతమైన ఆశయాల కోసం సమాజ మార్పు కోసం విలువల కోసం పరితపించాడు అని తెలిపారు. ప్రపంచీకరణ యుగంలో మాయమైపోతున్న మనిషిని మానవత్వాన్ని గుర్తుకు చేశాడు. కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మ రా ...అంటూ అమ్మ యొక్క గొప్పతనాన్ని చాటాడు. తెలంగాణ పోరాటంలో ప్రాణాలర్పించిన అనేకమంది విద్యార్థుల నిరుద్యోగుల త్యాగాలను తలుచుకొని కూలిపోయాడు. వారి అనన్య త్యాగాల మీద పురుడు పోసుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత అమరవీరుల ఆకాంక్షలకు భిన్నంగా ఎలా గడీలలో బందీ అయ్యిందో చూసి ఆవేదన చెందాడు. దొరల తెలంగాణ మనకొద్దంటూ నిలదీంచాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన జయ జయహే... తెలంగాణ జననీ జయ కేతనం అనే గీతానికి తెలంగాణ రాష్ట్ర గీతంగా పాలక ప్రభుత్వాలు సైతం గుర్తించాయంటే తెలంగాణ పట్ల ఆయనకు ఉన్న అంకిత భావాన్ని మనం అర్థం చేసుకోవచ్చని తెలిపాడు. జీవితమంతా శ్రమజీవిగా ప్రజాకవిగా ప్రజా వాగ్గేయకారుడుగా జీవించిన అందెశ్రీకి మరోసారి తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక తరపున జోహార్లు తెలియజేస్తున్నామని. ఈ సందర్భంగా ఆయన తన ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు .

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు కొండంత అండ

### బాలయ్య నగర్ అధ్యక్షులు నగేష్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 12 (నినాదం) :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు కొండంత అండగా ఉంటాయని గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ నగేష్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా పేద కుటుంబాలకు చెందిన ఆడపడుచుల వివాహాలకు ప్రభుత్వ సహకారము ఎంతో అవసరమని గుర్తించి అందించే కళ్యాణ లక్ష్మి పథకం ఆడపడుచు వివాహములో కొంతమేరకు సహకారం లభిస్తుందన్నారు. బాలయ్య నగర్ కు చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారు కరుష వెంకటేష్, శానమ్మ దంపతులకు వారి కుమార్తె వివాహమునకు గాను కళ్యాణ లక్ష్మి పథకంలో మంజూరైన ఒక్క లక్ష 116 రూపాయలు చెక్కును బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ నాగేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పార్వతి, చిన్న, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# సి.పి.ఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

- సి.పి.ఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపు

**పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 12 (నినాదం):** కార్మిక,కర్షకుల,పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సి.పి.ఐ పార్టీ అని, ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సి.పి.ఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు.బుధవారం రోజున స్థానిక జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శతాబ్ది ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ పార్టీ భారత గడ్డపై ఏర్పడిందని, భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాలని, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో బడుగు బలహీన వర్గాల జీవన విధానం మరింత క్లిష్టతరంగా మారిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో మైనార్టీలు,క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోయిందని,కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడానికి భారతదేశంలో సి.పి.ఐ పార్టీ అనేక పోరాటాలు చేస్తుందని అన్నారు. కాబట్టి ఖమ్మంలో డిసెంబర్ 26 న జరిగే శతాబ్ది ఉత్సవాలకు పెద్దపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగానే కాకుండా 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.ప్రతి ఒక్క కార్యకర్త ఈ సభకు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సి.పి.ఐ మండల కార్యదర్శి పూసాల రమేష్,పట్టణ కార్యదర్శి కల్లెపెల్లి నవీన్ కుమార్,చంద్రగిరి ఉదయ్,పేర్క సతీష్,మాచర్ల అంజి,తగరం నరేష్, సురేష్,రవి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం, తెలంగాణ
13 నవంబర్ 2025
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**చింతపల్లి ,నవంబర్ 12 (నినాదం):** అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గడియ గౌరారం గ్రామంలోని జక్కుల వెంకటయ్య యాదవ్ ఇంట్లో ఉన్నా పత్తిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు కారణంగా పత్తి పంట కొంతమేరకు దెబ్బ తిన్నదన్న విషయం ప్రభుత్వానికి తెలిసినప్పటికీ, రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వానికి ఎలాంటి చిత్త శుద్ధి లేదని తెలుస్తుందని అన్నారు. రైతలకు సేవ చేయాలనే దృక్పథం కలిగిన ప్రభుత్వం వెంటనే పత్తి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఉజ్జిని రఘురాం రావు, మైనార్టీ నాయకుడు ఎండి. ఖాలేద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ రోడ్‌పై నూతనంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలి



**చింతపల్లి ,నవంబర్ 12 (నినాదం):** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ పై నివాసముంటున్న ప్రజలతో పాటు బీసీ కాలనీలో ఉన్న రేషన్ లబ్దిదారులు రేషన్ షాప్ సరుకులు తీసుకోవాడానికి గ్రామంలో రెండు కిలోమీటర్ల మేర దూరం ప్రయాణం చేస్తూ, సరుకులు తీసుకోవాల్సిన సమస్య ఏర్పడిందని బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎల్లంకి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కాలనీ ప్రజలకు, ఎక్స్ రోడ్డు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా రేషన్ షాపును ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన మండల తాసిల్దార్ విజయలక్ష్మికి బుధవారం వినతి పత్రం అందజేశారు.

## సదరం సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




**మిర్యాలగూడ నవంబర్ 12( నినాదం) :** నెల 17న నల్గొండ జిల్లా కేంద్రం నాగార్జున కళాశాలలో జరగనున్న యాదవ సదరం సమ్మేళనం కార్యక్రమంను విజయవంతం చేయాలని సమ్మేళనం నిర్వహకులు యాదవ బలగం జిల్లా అధ్యక్షులు మేకల యాదన్న యాదవ్, కార్యనిర్వాహకులు దొంగరి శివ కుమార్ యాదవ్ లు కోరారు. బుధవారం స్థానిక బీసీ భవన్ లో సదరం సమ్మేళనం వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. యాదవ సంస్కృతి, సంప్రదాయాలు వివరించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో యాదవ సోదరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చే గొండి మురళి యాదవ్, దాసరాజుజయరాజు, చింతలచెరువు లింగయ్య యాదవ్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ దశరథ నాయక్, డాక్టర్ రాజు సామాజికవేత్త, చిర్ర మల్లయ్య , జవాజి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిరంజీవి, ఊరిబండి శీను యాదవ్, చి మట శ్రీనివాస్ యాదవ్, కొండా రాంబాబు,పట్టణ అధ్యక్షులు క్రాంతి, దారం మల్లేష్, బిక్షం, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సోమయ్యకు ఘన నివాళులు

ఆర్థిక సాయం అందజేసిన

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం



**కల్వకుర్తి, నవంబర్ 12 (నినాదం) :** కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు సోమయ్య మంగళవారం మృతి చెందాడు. బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం లు పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సోమయ్య మృతదేహానికి పూలమాలన్ని వేసి నివాళులర్పించి. రూ .10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని సోమయ్య తల్లి కి అందజేశారు. సోమయ్య కుటుంబాన్ని టిఆర్ఎస్ పార్టీ తరపున అన్ని విధాల ఆదుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు వారు భరోసా కల్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చే నివాళులర్పించిన వెల్దండ మాజీ ఎంపీపీ పుట్ట రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపి వెంకటయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, పోతేపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్, తలకొండపల్లి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దండ మండల టిఆర్ఎస్ నాయకులు జంగిలి ఆనంద్, కొండల్ యాదవ్, శ్రీను, అశోక్, ప్రభాకర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ప్రతినిధి నవంబర్ 12 (నినాదం):** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లి లో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి దాన్యం తేమశాతాన్ని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, హమాలీలతో ముఖాముఖి మాట్లాడారు.అనంతరం మాట్లాడుతూ గడచిన 20 రోజులు వర్షానికి తడవడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని, దానివల్ల ధాన్యం కొనుగోలు ఆలస్యమైందని, అయితే ప్రస్తుతం పరిస్థితులు బాగున్నందున ప్రతిరోజు 10,000 మెట్రిక్ టన్నులకు పైగానే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతున్నదని, అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్,



అధికారులతో సమీక్షించి ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. అయితే రైతులు తొందరపడి ప్రైవేట్ లో ధాన్యం అమ్మవద్దని, రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందడంతో పాటు, బోనస్ ని పొందాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు రాత్రి, పగలు కష్టపడి పని చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.నల్గొండ నియోజకవర్గంలో బ్రాహ్మణ వెల్లేముల తో పాటు, కాలువలు పూర్తి అయితే చుట్టుపక్కల ఉన్న చర్లపల్లి, మర్రిగూడెం ,అన్నేపర్తి, కంచనపల్లి చెరువులను నింపుతామని, తద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, చుట్టుపక్కల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అన్నారు. ఇందుకు సంబంధించి భూసేకరణకు 17 కోట్ల రూపాయలు అందుబాటులో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా దీనిని పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. తన హాయంలోనే తీసుకువచ్చిన ఎస్ఎల్బిసి టన్నెల్ దురదృష్టకర సంఘటన వల్ల కూలిపోవడంతో పనులు ఆగిపోయాయని, అయితే తిరిగి ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా మాగ్నెటిక్ సర్వేను ప్రారంభించడం జరిగిందని, రెండు సంవత్సరాలలో ఎస్ఎల్ బి సి టన్నెల్ పూర్తయితే ప్రతి సంవత్సరం 2 పంటలకు సాగునీరు అందుతుందని, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డి.ఎస్.ఓ వెంకటేష్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు మంత్రి వెంట ఉన్నారు .

## చోరీకి గురైన 30 మొబైల్ ఫోన్లు రికవరీ...






- యజమానులకు అప్పగింత
- సీఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసిన ఫోన్లు....
- ఇప్పటివరకు 2,938 ఫోన్ల రికవరీ
- వివరాలు వెల్లడించిన అదనపు డీసీపీ (అడ్మిన్) బి. రామానుజం

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 :(నినాదం):** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న 30 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఇఐఆర్) పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగిం చినట్లు అదనపు డీసీపీ (అడ్మిన్) బి. రామానుజం తెలిపారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనల తో ఐటీ సెల్ బృందం గుర్తించిన ఈ ఫోన్లను బుధవారం కమిషనర్ కార్యాలయంలో బాధితులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఇఐఆర్) విధానంతో సుమారు ఎనిమిది లక్షల రూపాయల విలువ గల 30 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమై న యజమానులకు అప్పగించా మని తెలిపారు. ఒక్కో మొబైల్ ఫోన్ ?10,000 నుండి ?50,000 విలువ గలదని చెప్పారు.ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు సిఇఐఆర్ పోర్టల్‌లో 7,998 ఫిర్యా దులు నమోదు కాగా, అందులో 2,938 మొబైల్ ఫోన్లు విజయవం తంగా ట్రాక్ చేసి బాధితులకు తిరిగి అందజేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్ ప్రస్తుత జీవనశైలిలో అత్యంత కీలకమైన పరికరమైం దని, ఫోన్ ద్వారా సమాచారం, నగదు లావాదేవీలు, వ్యక్తిగత డేటా విస్తృతంగాఉపయోగించబడుతున్నందున, పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన ఫోన్లను సి ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన ఐటీ సెల్ ఇన్‌చార్జి హేమనాథ్ మరియు టెక్నికల్ బృందాన్ని అదనపు డీసీపీ ఈ సందర్భంగా అభినందించారు.

## జోనల్ లెవల్ ఎన్‌పీఎల్‌లో మెరిసిన నారాయణ నిజామాబాద్ బ్రాంచ్






**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 12 (నినాదం) :** నారాయణ ప్రీమియల్ లీగ్ జోనల్ లెవల్ పోటీల్లో నిజామాబాద్ నారాయణ బ్రాంచ్ విజేతగా నిలిచింది. ఎన్ పీఎల్ లీగల్ పోటీల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, భైంసా, కామారెడ్డి, ఆర్మూర్ బ్రాంచ్ ల జోనల్ లెవల్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు 16 ఆటలలో 13 ఆటలను అద్భుతంగా గెలుచుకుని, వివిధ విభాగాలలో అత్యుత్తమ బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఈవో అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ అద్భుతమైన విజయం ప్రతిభావంతులైన విద్యార్థులు, బృందం కృషి, అంకితభావానికి నిదర్శనమన్నారు. విజేతలు సంస్థకు అవార్డులను తెచ్చిపెట్టారని, వారి విజయానికి తాము వారిని అభినందిస్తున్నామన్నారు. ఈ జోనల్ లెవల్ పోటీల్లో నిజామాబాద్ బ్రాంచ్ జోనల్ లెవల్ ఎన్ పీఎల్ ఛాంపియన్ గా నిలిచింది. మిగిలిన 5 బ్రాంచ్‌లను అధిగమించి అగ్ర బహుమతులను గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివాజీ, ప్రసాద్, హైస్కూల్ ఆర్ డి అశోక్, చాంప్స్ ఆర్ డి హెడ్ స్వాతి, ఈ కిడ్జ్ ఆర్ డి హెడ్ సంగీత, కోఆర్డినేటర్లు రాకేష్, అజీమా, కల్పన, నరేష్, కళ్యాణిలు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జోన్, నిజామాబాద్ జోన్ ప్రిన్సిపాల్స్ చందన, రజని, కిషోర్, నిర్మల్ ప్రిన్సిపాల్ పార్వతి, భైంసా ప్రిన్సిపాల్ ప్రభు, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, కరణ్ సర్ నేతృత్వంలోని స్పోర్ట్స్ టీమ్, సాఫ్ట్ స్కిల్స్ టీమ్, స్పోర్ట్స్ ఇంచార్జ్ పవన్, తల్లిదండ్రులు ప్రీమియం లీగ్ లో పాల్గొని ఈవెంట్‌ను విజయవంతం చేశారు. తమ బృందం అవిశ్రాంత కృషిని అభినందిస్తున్నామన్నారు. నిరంతర విజయం కోసం ఎదురుచూస్తున్నామని, యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థుల విజయాల పట్ల గర్వంగా ఉన్నారన్నారు. వారు రాణించడానికి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. కరణ్ , పవన్ నేతృత్వంలోని స్పోర్ట్స్ టీమ్, తల్లిదండ్రులు విజయానికి దోహదపడ్డాయన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి





- నగదు రహిత వైద్య పథకాన్ని ప్రారంభించాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహముత్తారం మండలం మీనాజిపేట, బోర్లగూడెం,నిమ్మగూడెం పాఠశాలల్లో, గిరిజన ఆశ్రమ పాఠశాల పెగడపల్లిలో టీచర్లతో సమావేశాలను నిర్వహించి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ పడ్డ విధంగా ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని అందించే విధంగా హెల్త్ కార్డులను మంజూరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల, ఉపాధ్యాయుల పెండిరగ్ సమస్యల పరిష్కారం కోసం టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో మూడు దశల పోరాటాలను నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి గిరిజన సంక్షేమ శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వేతన సవరణకై ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా పే-రివిజన్ కమీషన్ రూపొందించిన పిఆర్‌సి రిపోర్టును ప్రభుత్వం వెంటనే ప్రకటించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నదని, ఉపాధ్యాయుల, పెన్షనర్ల వివిధ రకాల పెండిరగ్ ఆర్థిక బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. 317 జి.ఓ. ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు 3 సంవత్సరాల తాత్కాలిక బదిలీ కోసం విడుదల చేసిన 190 జి.ఓ. లో మార్పులు చేయాలని, ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ జి.ఓ.25 ప్రకారం చేయాలనే నిబంధనలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పనివేళల్లో ఉపాధ్యాయులను తరగతి బోధనకు దూరం చేసే విధంగా నిర్వహించే వృత్యంతర శిక్షణలను నిలిపివేయాలని, వేసవి సెలవుల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే విడుదల చేయాలని, గురుకుల, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆ సమావేశాల్లో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బానోతు సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి జగపతిరావు , ఉపాధ్యక్షులు సాంబయ్య, సీనియర్ నాయకులు సతిష్ ప్రకాష్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఎల్కతుర్తి సిఐ రమేష్




**భీమదేవరపల్లి నవంబర్ 12 (నినాదం):** గత కొద్దిరోజులుగా ఎల్కతుర్తి సిద్దిపేట జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో,హనుమ కొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి శివారులో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎల్కతుర్తి సిఐ రమేష్ ఆధ్వర్యంలో ముల్కనూర్ ఎస్సై రాజు వంగర ఎస్సై దివ్య ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ మరియు సిబ్బందితో కలిసి కొత్తపల్లి గ్రామ శివారులో వెహికల్ చెకింగ్ చేయడం జరిగింది. ఇందులో ముఖ్యంగా త్రిబుల్ రైడింగ్ ఓవర్ లోడ్ ఉన్న భారీ వాహనాల కు జరిమానా విధించి అతి డ్రైవర్లకు సిఐ కౌన్సిలింగ్ చేయడం జరిగింది.

## బాల మిత్ర అవార్డు ప్రదానోత్సవాన్ని విజయవంతం చేయండి

వలస సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర

అధ్యక్షుడు బాలల హక్కుల ప్రజా వేదిక



**భీమదేవరపల్లి నవంబర్ 12 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ ఈనెల 14న బాలల దినోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో బాలమిత్ర అవార్డులు ప్రధాన కార్యక్రమం మినీ రవీంద్ర భారతి హాల్ హైదరాబాద్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు చిన్నారి బాల బాలికలకు వారిలో నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు వారిలో దాగివున్న సృజనాత్మ శక్తి పెంచేందుకు దోదపడుతుందని వారు తెలుపుతూ వివిధ రంగాలైన చిన్నారి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఈ నైపుణ్యము ఉన్న విద్యార్థులకువివిధ రంగాలు. దేశభక్తి పాటలు. భరతనాట్యం. గిటార్. కీబోర్డు ప్లేయింగ్. ఫ్లూటు. పర్వతాహొరన. యోగా. చిత్రలేఖనం. కార్టూన్స్. కవిత్వం జానపద నృత్యం. జానపద పాటలు. మిమిక్రీ .మ్యాజిక్. సైకిలింగ్. వాలీబాల్. కబడ్డీ. కోకో బ్యాట్మింటన్. చెస్. ఫుట్బాల్. రన్నింగ్. జాతీయ సమైక్యత శిబిరం.. కరాటే. కూచిపూడి. కోలాటం. తబలా. బతుకమ్మ. స్విమ్మింగ్. బాస్కెట్బాల్. స్కిటింగ్.టెన్నిస్ .అర్చరి .ఈ రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బాలమిత్ర అవార్డులు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆయనే తెలిపారు కార్యక్రమంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## ఆర్చి నిర్మాణంలో నాణ్యత లోపం



**మహాదేవపూర్ నవంబర్ 12, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర దేవస్థానం నిధులతో నిర్మిస్తున్న ఆర్చి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం కొట్టవలసినట్లు కనిపిస్తుంది. గతంలో ఉన్న ఆర్చి ని కాళేశ్వరం ప్రాజెక్టు తరలిస్తున్న బాహుబలి మోటార్లకు అడ్డుగా వస్తుందని తొలగించారు. అట్టి నిర్మాణానికి గాను ప్రాజెక్ట్ అధికారులు దేవస్థానానికి నిధులు డిపాజిట్ చేశారు. కాగా సరస్వతి పుష్కరాలలో మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆర్చి నిర్మాణానికి దేవాదాయ శాఖ 37 లక్షల రూపాయల నిధుల ను టెండర్ ద్వారా కేటాయించింది. అప్పటినుండి ఇప్పటివరకు మందకొండగా సాగిన అభివృద్ధి పనులను మంగళవారం దేవాదాయ కమిషనర్ హెచ్చరించడంతో తిరిగి పనులను కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. ఇట్టి పనులలో కంకరలో మట్టి కలిసి ఉన్న పట్టించుకోకుండా మరి పిల్లర్లలో పోస్తుండటం గమనార్హం. దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించకపోవడం కాంట్రాక్టర్ ఇష్ట రాజ్యాంగ పనులు నిర్వహిస్తుండటం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల నిర్వహణలో నాణ్యత లోపం జరగకుండా చూసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు పనుల వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.